P-01_Layout 2 08-Aug-26 02:12 AM Page 1

RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 305 | సంపుటి 4 | శనివారం | 08-08-2026 | పేజీలు 4 | వెల 3/-

# రూ.కోట్ల విలువైన ధాన్యం మాయం

- దమ్ముంటే పట్టుకోండీ అంటూ అధికారులకే మిల్లర్ల సవాల్
- విజిలెన్స్ అధికారులు తనిఖీలు తూతూమంత్రం..!
- నిద్రమత్తులో యంత్రాంగం.. పత్తాలేని సివిల్ సప్లైస్ కమిషనర్..!
- వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టినట్లు ఆరోపణలు
- మిల్లర్ల దందాకు అధికారుల అండదండలున్నాయంటూ విమర్శలు
- మిల్లులపై 'పీడీ యాక్ట్'లు ఏవి?.. జిల్లా అధికారుల ఉదాసీనతపై సర్వత్రా నిరసన
- తక్షణమే జోక్యం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రికి ప్రజల విజ్ఞప్తి



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు మద్దతు ధర ఇచ్చి సేకరించిన ధాన్యం మిల్లులకు చేరాక రెక్కలొచ్చి ఎగిరిపోతోంది.కేసముద్రం మండలంలో కోట్లాది రూపాయల విలువైన(2025-26) ఖరీఫ్, రబీ సీజన్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ ధాన్యం పక్కదారి పట్టినా.. సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం 'ఏమీ ఎరుగనట్లు' వ్యవహరిస్తున్నారు. ఇటీవల కేసముద్రం లోని పలు మిల్లులపై జరిపిన విజిలెన్స్ అధికా రుల తనిఖీలు కేవలం 'కాగితాల పరిమితం'గా, 'తూతూ మంత్రం'గా మారాయనే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి బియ్యం రూపంలో అందించాల్సిన కొందరు మిల్లు యజమానులు, అధికారుల అండదండలతో ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మేము ధాన్యాన్ని బరాబర్ అమ్ముకుంటాం మమ్మల్ని ఆపేదెవరూ అంటూ మిల్లర్లు నక్క గాంభీర్యాలు పెడుతున్నారు.2025-26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుల గోదాముల్లో ఉండాల్సింది పోయి.. వ్యాపారుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. లెక్కల్లో మాత్రం ధాన్యం ఉన్నట్లు చూపిస్తూ, క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తే అధికారుల నోళ్లు మూయిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.ఇంత జరుగుతున్నా విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. తనిఖీల పేరిట మిల్లుల వద్దకు రావడం, 'చాయ్–బిస్కెట్' మర్యాదలు స్వీకరించి, ఏదో ఒక చిన్న సాంకేతిక లోపాన్ని చూపిస్తూ మమ అనిపించడం పరిపాటిగా మారింది. అసలు గోదాముల్లో ఎంత ధాన్యం ఉండాలి? ఎంత ఉంది? అనే ప్రాథమిక లెక్కలను కూడా సరిగ్గా తనిఖీ చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.ప్రభుత్వ ధాన్యాన్ని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. పక్కదారి పట్టించిన రైస్ మిల్లుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, సదరు నిర్వాహకులపై 'పీడీ యాక్ట్' నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలు కేవలం పేపర్ ప్రకటనలకే పరిమితమయ్యాయా? అని ప్రశ్నిస్తున్నారు.జిల్లా స్థాయిలో సివిల్ సప్లైస్ అధికారులు, డీఎస్ఓలు, తహశీల్దార్లు మిల్లుల అక్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.కేసముద్రం మండలంలో క్షేత్రస్థాయిలో ఇంతటి భారీ కుంభకోణం జరుగుతున్నా.. రాష్ట్రీయ పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్పందించకపోవడం, అసలు ఈ వ్యవహారంపై ఆయన జాడే లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కనీసం జిల్లా అధికారుల నిర్లక్ష్యంపైనా, లోపాయికారీ ఒప్పందాలపైనా శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేకపోతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.లక్షలాది మంది పేదల పొట్ట నింపేందుకు, రైతులను ఆదుకునేందుకు కేటాయించిన ధాన్యం అక్రమార్కుల పాలువుతుంటే చూస్తూ ఊరుకోవడం తగదని ప్రజా సంఘాలు, పౌరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్యేకంగా జోక్యం చేసుకోవాలని కేసముద్రం మండల ప్రజలు కోరుతున్నారు. కొందరు దొంగ మిల్లర్లకు అధికార పార్టీ పెద్ద లీడర్లు కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కేసముద్రంలో జరుగుతున్న ఈ దందా పై దృష్టి పెట్టి హైదరాబాద్ నుండి ప్రత్యేక బృందాలను పంపి ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లుల నిర్వాహకులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని,నిర్లక్ష్యంగా వ్యవహరించిన జిల్లా స్థాయి పౌరసరఫరాల అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మేధావులు అంటున్నారు. ఒక ప్రత్యేక ఉన్నత స్థాయి కమిటీని వేసి మిల్లుల్లో సమగ్ర 'స్టాక్ వెరిఫికేషన్' చేపట్టి, ప్రభుత్వ ఆస్తిని రికవరీ చేయాలని సగటు పౌరుడు గగ్గోలు పెడుతున్నాడు.మరి ఇప్పటికైనా పౌరసరఫరాల శాఖ మంత్రి, కమిషనర్ స్పందించి అక్రమార్కుల గుట్టు రట్టు చేస్తారో.. లేక ఈ దందాను ఇలాగే కొనసాగనిస్తారో వేచి చూడాల్సిందే...!

— కేసముద్రం, ఆగస్టు 7 (ప్రభాత గమనం)

---

## రాష్ట్రంలో వర్షాల కోసం

# వరుణ యాగం

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో యాగం
- పూర్ణాహుతిలో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్టు 7:

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగ ణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి వి ముక్తి కలిగి, కృష్ణా–గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ



పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాం క్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పా ట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.

---



# సీఎంతో ఆర్థికవేత్త సుబ్రమణియన్ భేటీ

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్టు 7:

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుకునేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు తీసుకెళ్లే అంశంపై ప్రముఖ భారత ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎంసీఆర్ హెచ్ఆర్డీలో శుక్రవారం భేటీ అయి చర్చించారు. ఎక్సైజ్, జీఎస్టీ సంస్కరణలపైన, రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచుతూ సులభతర వాణిజ్యం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)ను మెరుగుపరిచే మార్గాలపై దృష్టి పెట్టడంపై కూడా చర్చించారు. ఈ భేటీలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణా రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, కమర్షియల్ టాక్స్ అండ్ ఎక్సైజ్ సెక్రటరీ రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు

---

## 59 నియోజకవర్గాల్లో బీసీల

# రాజ్యాధికార పోరు

- "సర్జికల్ స్ట్రైక్-59"తో తీన్మార్ మల్లన్న సంచలనం
- కత్తెర గుర్తుతో అగ్రవర్ణాల రాజకీయ గుత్తాధిపత్యానికి చెక్
- 2028లో బీసీల రాజ్యాధికారమే లక్ష్యం
- టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హైదరాబాద్ ఆగస్టు 7(ప్రభాత గమనం):

తెలంగాణలో రెడ్డి, వెలమ, కమ్మ సామాజిక వర్గాల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలికి బీసీలకు రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న "సర్జికల్ స్ట్రైక్-59" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్మూర్, బోధన్, నిర్మల్, బాన్సువాడ నియోజకవర్గాల ఎన్నికల చరిత్ర, ఓటర్ల గణాంకాలు, ప్రజాప్రతినిధుల వివరాలను వెల్లడిస్తూ బీసీలు రాజకీయంగా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.

2



# ఆగస్టు 15న 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీ

- సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- రాష్ట్రంలో 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం
- ప్రతి నెలా ఉచితంగా 6 కిలోల సన్నబియ్యం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
- రాష్ట్రమంతా ఏకకాలంలో ప్రారంభించాలని కలెక్టర్లకు ఆదేశాలు




హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్టు 7:

రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు 15 స్వా తంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ద్వారా తెలంగాణలోని 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారని మంత్రి తెలిపా రు. ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా ప్రతి అర్హుడికి ప్రతి నెల 6 కిలోల నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందించనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అమలుకు ప్రతి నెల సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మం త్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించడంతో పాటు రాష్ట్రంలోని మిగిలిన 32 జిల్లా ల్లోనూ అదే రోజు ఏకకాలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలు ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్హ కుటుంబానికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన ఆహార భద్రతను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. "స్వతంత్ర భారతదేశంలో అత్యంత సమర్థవంతమైన ఆహార భద్రతా కార్యక్రమాల్లో ఒకటైన ఈ మహత్తర కార్యక్రమంలో చిన్న పాత్ర పోషించడం ఆనందదాయకంగా ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్స వం రోజున జరిగే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ స్మార్ట్ రేషన్ కార్డులను పొందేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా యంత్రాంగాన్ని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలని స్పష్టం చేశారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- కాజీపేట ట్రాఫిక్ సీఐ వెంకన్న
- ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

నగరంలో ట్రాఫిక్ క్రమశిక్షణను మెరుగుపరచడం, రోడ్డు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా కాజీపేట జంక్షన్‌లో ఆటో డ్రైవర్లు, యజమానులకు ట్రాఫిక్ కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పిట్టల వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వెంకన్న మాట్లాడుతూ, ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆటోల్లో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, డీజే సౌండ్ బాక్సులను ఉపయోగించవద్దని తెలిపారు. అలాగే నిర్దేశించిన వేగ పరిమితులను పాటిస్తూ, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించాలని సూచించారు. రోడ్లపై ఇష్టానుసారంగా ఆటోలను నిలిపివేయకుండా, నిర్దేశించిన ఆటో స్టాండ్లలో మాత్రమే పార్కింగ్ చేయాలని, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని తెలిపారు. యూనిఫాం ధరించి విధులు నిర్వహించడం కూడా తప్పనిసరి అని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఆయన, ప్రమాదరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, ఆటో యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.




## ఏనుమాముల ఈవీఎం స్ట్రాంగ్ రూంను పరిశీలించిన కలెక్టర్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతా ఏర్పాట్లతో పాటు స్ట్రాంగ్ రూమ్‌లో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, పర్యవేక్షణ వ్యవస్థను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈవీఎంల భద్రత విషయంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, భద్రతలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్నికల సూపరింటెండెంట్ రజిని తదితర అధికారులు పాల్గొన్నారు.






## తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద


ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా వరంగల్ ప్రాజెక్టు లక్ష్మీనగర్ సెక్టార్ పరిధిలోని విద్యానగర్ ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలు తప్పనిసరిగా సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. శిశువుకు పుట్టిన వెంటనే తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు పరిపూరక ఆహారాన్ని ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు అందించడం ద్వారా శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. బాలికల భవిష్యత్ విద్య, ఉన్నత చదువులు, వివాహ అవసరాల కోసం సుకన్య సమృద్ధి యోజన ఎంతో ఉపయోగకరమైన పథకమని పేర్కొంటూ, ప్రతి కుటుంబం తమ కుమార్తెల పేరిట ఖాతా ప్రారంభించి క్రమం తప్పకుండా పొదుపు చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి. రాజమణి మాట్లాడుతూ, 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ విద్యతో పాటు పోషకాహారం, ఆరోగ్య సేవలు, ఆటల ద్వారా నేర్చుకునే విధానం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక నైపుణ్యాలు పెంపొందుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ విద్య, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## గడువు ముగిసిన మందు ఇవ్వడంపై ఆగ్రహం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ చిన్నారికి గడువు ముగిసిన సిరప్ అందించిన ఘటన కలకలం రేపింది. ఇందిరానగర్ కాలనీకి చెందిన మురళీ తన నాలుగేళ్ల కుమారుడు ఎనోస్ రాజ్‌ను వాంతులు, విరోచనాల సమస్యతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు చిన్నారిని పరీక్షించి రెండు సిరప్‌లు సూచించారు. అందులో ఒక సిరప్‌ను ఆసుపత్రిలోనే అందజేయగా, మరో సిరప్‌ను బయట కొనుగోలు చేయాలని సూచించారు. ఇంటికి వెళ్లిన అనంతరం ఆసుపత్రిలో ఇచ్చిన సిరప్‌ను చిన్నారికి ఇవ్వబోతుండగా, దాని గడువు 2026 జూన్‌లోనే ముగిసినట్లు తండ్రి గుర్తించారు. దీంతో వెంటనే ఆసుపత్రికి చేరుకుని సిబ్బందిని నిలదీయగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. "గడువు ముగిసిన మందు ఇస్తే పిల్లాడి ప్రాణానికి ఎవరు బాధ్యత వహిస్తారు?" అంటూ మురళీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. కాగా, ఈ ఘటనపై ఆసుపత్రి అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.




## తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలి

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్టు 7:

అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా, సుఖశాంతులతో జీవించాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లు ఆకాంక్షించారు. శాసనసభ ఆవరణలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో ఆషాఢ మాసం బోనాల పండుగ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్, మండలి చైర్మన్‌లు ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పూజల్లో పాల్గొన్న ప్రముఖులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉద్యోగులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

## నేడు పింఛనుదారుల మహాధర్నా

హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్టు 7:

తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నేడు ఆగస్టు 7న మహాధర్నాకు పిలుపునిచ్చారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, పీఆర్సీ అమలు, హెల్త్ స్కీమ్ మెరుగుదల వంటి ప్రధాన డిమాండ్లతో ఈ ఆందోళన చేపడుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమను ప్రభుత్వం విస్మరించడం సరికాదనీ, తక్షణమే జోక్యం చేసుకుని డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరుతున్నారు. రాజధాని హైదరాబాద్‌తో పాటుగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల దగ్గర ఈ నిరసన కార్యక్రమాలు జరగనున్నాయి. న్యాయమైన తమ హక్కుల కోసం చేస్తున్న ఈ పోరాటంలో ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని పింఛనుదారుల సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.



## సెప్టెంబర్ 9 వరంగల్లో జాతీయ సదస్సును జయప్రదం చేయండి

- ఎమ్మార్పీఎస్ మహబూబాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ జన్ను దినేష్ మాదిగ, కో-ఇన్‌ఛార్జ్ ఏకు శంకర్ మాదిగ
- గార్లలో ఎమ్మార్పీఎస్ విస్తృత స్థాయి సన్నాహక సమావేశం

గార్ల, ఆగస్టు 7(ప్రభాత గమనం):

వచ్చే సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న నూతన మండల కమిటీల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మహబూబాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ జన్ను దినేష్ మాదిగ, కో-ఇన్‌ఛార్జ్ ఏకు శంకర్ మాదిగ పిలుపునిచ్చారు.శుక్రవారం గార్ల మండల కేంద్రంలోని వర్తక సంఘ భవనంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జ్ ఇరుగు రవీందర్ మాదిగ అధ్యక్షతన నూతన మండల కమిటీల జాతీయ సదస్సు సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా నాయకులు మాట్లాడుతూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి దూరదృష్టి, నాయకత్వంలో గడిచిన 32 ఏళ్లుగా సాగిన సుదీర్ఘ, శాంతియుత పోరాటం వల్లనే మాదిగ జాతి విజయం సాధించి, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఫలించిందని స్పష్టం చేశారు.మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు చేపట్టిన "గో టు విలేజ్" కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోనూ మాదిగ వర్గాలను చైతన్యపరుస్తున్నామని తెలిపారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో లభించే అవకాశాలను అందుకుంటూ భావితరాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.సెప్టెంబర్ 9న జరగబోయే జాతీయ సదస్సు కంటే ముందే గార్ల మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేసి, మండల కమిటీని ఎన్నుకోవాలని సూచించారు. సదస్సుకు మండల వ్యాప్తంగా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.సమావేశం అనంతరం నాయకులు, కార్యకర్తలు ఆరోగ్యశ్రీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొరివి మండల ఇన్‌ఛార్జ్ దూడపంగు శ్రీనివాసరావు మాదిగ, భాషాపంగు జయరాజు మాదిగ, కొత్తపల్లి వెంకన్న మాదిగ, సిరిపంగి నారాయణ, ఇల్లుటూరి శ్రీనివాస్, ఇమ్మడి వెంకన్న, పుల్లూరు వెంకటేశ్వర్లు, బొజ్జ భిక్షం, పందుల కృష్ణ, జిల్లపల్లి వెంకటేశ్వర్లు, అంకెపాక కిరణ్ కుమార్, భాషాపంగు చిరంజీవి, చిలుకూరి పెద్ద వెంకన్న, గిన్నారపు మురళీతారకరామారావు, పందుల పృథ్వి, గడ్డం శ్రీశైలం, ఏలూరు సాయికుమార్, కాంపాటి హర్షవర్ధన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థినులకు ప్లేట్లు, బెడ్ షీట్లు పంపిణీ

కేసముద్రం ఆగస్టు 7(ప్రభాత గమనం):

జిల్లాలోని కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ విద్యార్థినులకు శుక్రవారం జిసిడిఓ వై. గాయత్రి ఆధ్వర్యంలో ప్లేట్లు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిసిడిఓ గాయత్రి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పీ. నవీన్ విద్యార్థులను నిద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ప్రభుత్వానికి, మోడల్ స్కూల్ కు, మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. చదువుతోపాటు మీలో ఉన్న సృజన సృజనాత్మకతను ప్రపంచానికి తెలియజేయాలని విద్యార్థినులకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు సురేందర్, హాస్టల్ ఏఎన్ఎం మమత, విద్యార్థినులు పాల్గొన్నారు.



## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- ప్రజల సహకారంతో మూడు గ్రామాల్లో కెమెరాల ఏర్పాటు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో

ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత కీలకమని దామెర ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు అన్నారు. దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్, తక్కెళ్లపాడు, కౌకొండ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, రహదారి ప్రమాదాల దర్యాప్తు వంటి అంశాల్లో పోలీసులకు ఎంతో తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. ముఖ్య కూడళ్లు, ప్రధాన రహదారులు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కౌకొండ గ్రామ సర్పంచ్ ఓదెల శ్రీలత, ఉపసర్పంచ్ ముక్కెర రాజు రూ.50 వేల విలువైన సహాయం అందించారు. తక్కెళ్లపాడు సర్పంచ్ వసంత రమేష్ రూ.27 వేల విలువైన సీసీ కెమెరాలను అందజేయగా, వెంకటాపూర్ సర్పంచ్ పంచగిరి రాజు, ఉపసర్పంచ్ గోల్కొండ రమేష్ రూ.25 వేల ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను ఎస్సై అభినందించారు. ప్రజల భద్రత కోసం ఇతర గ్రామాల ప్రజాప్రతినిధులు, దాతలు కూడా ఇలాంటి కార్యక్రమాలకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

P-03_Layout 2 08-Aug-26 01:11 AM Page 1





## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

మహబూబాబాద్ ఆగస్టు 7(ప్రభాత గమనం):

శిశువుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ప్రసన్న, ఐసీడీఎస్ సూపర్వైజర్ జలగం సునీత పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగ మండలంలోని మేచరా జుపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో గ్రామపంచాయతీ స్థాయిలో తల్లులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవజాత శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత ఆవశ్యకమని, తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల పిల్లలలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలు బిడ్డకు సమగ్ర పోషకాహారాన్ని అందించి, వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయని వివరించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో స్థానిక చిన్నారికి ఘనంగా అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సర్పంచ్ తూర్పాటి శంకర్, ఉపసర్పంచ్ తాళ్లపెల్లి వెంకన్న గౌడ్, మరియు రజిత, సునీత, ఆశా వర్కర్లు, ఎర్రబెల్లిగూడెం, బడితండ, రామానుజపురం, కచికల్ గ్రామాల అంగన్వాడీ టీచర్లు, తల్లులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.




## ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోని ప్రభుత్వం

మహబూబాబాద్ ఆగస్టు 7(ప్రభాత గమనం):

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందని టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ అన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఇచ్చిన దశల వారి పోరాట కార్యక్రమంలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాల బ్రాహ్మణపల్లిలో నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాలకు హాజరై మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఆరు డీఏలు పెండింగ్లో ఉన్నాయని, పిఆర్సి కమిషన్ వేసి మూడు సంవత్సరాలు దాటిపోయిందని వాపోయారు. మే నెలలో సమస్యల పరిష్కారం కొరకు ఉద్యోగులు ఉద్యమం చేస్తున్న నేపథ్యంలో కొద్దిరోజుల్లోనే మీ సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చారని కానీ ఇప్పటివరకు డిఏల విషయంలో పిఆర్సి విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే సిపిఎస్ ను రద్దు చేశారని తెలంగాణలో ఎలాంటి కార్యాచరణ తీసుకోలేదని తక్షణమే సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధారావత్ బద్రు, పాలకుర్తి మౌనిక, మాడిశెట్టి సూర్యప్రకాష్, గొట్టిముక్కల పవన్ రాజ్, కుప్పం సూర్య తేజ, బానోత్ శంకర్, గిద్ద శృతి పాల్గొన్నారు.



## పురుగు మందుల షాపుల్లో ఏడీఏ తనిఖీలు

- 'పారాక్వాట్' అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరిక
- పుల్లూరు, గార్ల గ్రామాల్లో డివిజన్ వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీలు
- రసాయనాలకు స్వస్తి చెప్పి, సేంద్రియ ఎరువులు వాడాలని పిలుపు

గార్ల ఆగస్టు 7 (ప్రభాత గమనం):

మండల పరిధిలోని పుల్లూరు, గార్ల గ్రామాలలోని పురుగు మందులు, ఎరువుల దుకాణాల్లో మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాస్ రావు, మండల వ్యవసాయ అధికారి రామారావుతో కలిసి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఏడీఏ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం నిషేధించిన 'పారాక్వాట్' కలుపు మందును ఏ వ్యాపారైనా నిల్వ ఉంచినా లేదా రైతులకు విక్రయించినా సహించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే షాప్ లైసెన్స్ను తక్షణమే రద్దు చేయడంతో పాటు సదరు వ్యాపారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తీవ్రంగా హెచ్చరించారు."పారాక్వాట్ అత్యంత విషపూరితమైన కలుపు మందు. దీని వాడకం వల్ల పంటలకు, భూసారానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అందుకే ప్రభుత్వం దీనిపై పూర్తి నిషేధం విధించింది. వ్యాపారులు కేవలం అనుమతించిన పురుగు మందులు, ఎరువులను మాత్రమే నిబంధనలకు లోబడి విక్రయించాలి.ప్రతి పురుగు మందుల దుకాణదారుడు ఖచ్చితంగా స్టాక్ రిజిస్టర్ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలి. రైతులు యూరియా, కాంప్లెక్స్ వంటి రసాయన ఎరువుల వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలని కోరారు. రసాయనాలకు బదులుగా జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులను విరివిగా వాడాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వల్ల నేలలో 'సేంద్రియ కార్బన్' పెరిగి భూసారం రెట్టింపు అవుతుందని, పంట దిగుబడి కూడా నాణ్యంగా వస్తుందని వివరించారు.పంటల సాగులో ఎదురయ్యే ఎలాంటి సందేహాలకైనా రైతులు నేరుగా వ్యవసాయ అధికారులను సంప్రదించి, వారి సలహాలు స్వీకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులు , రైతులు పాల్గొన్నారు.

# 59 నియోజకవర్గాల్లో బీసీల రాజ్యాధికార పోరు

- "సర్జికల్ స్ట్రైక్-59"తో తీన్మార్ మల్లన్న సంచలనం
- కత్తెర గుర్తుతో అగ్రవర్ణాల రాజకీయ గుత్తాధిపత్యానికి చెక్
- 2028లో బీసీల రాజ్యాధికారమే లక్ష్యం
- టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

హైదరాబాద్ ఆగస్టు 7(ప్రభాత గమనం):




తెలంగాణలో రెడ్డి, వెలమ, కమ్మ సామాజిక వర్గాల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలికి బీసీలకు రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న "సర్జికల్ స్ట్రైక్–59" కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్మూర్, బోధన్, నిర్మల్, బాన్సువాడ నియోజకవర్గాల ఎన్నికల చరిత్ర, ఓటర్ల గణాంకాలు, ప్రజాప్రతినిధుల వివరాలను వెల్లడిస్తూ బీసీలు రాజకీయంగా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.

### ఆర్మూర్ లో14 సార్లు రెడ్డి ఎమ్మెల్యేలే...

1952 నుంచి ఆర్మూర్లో జరిగిన 16 ఎన్నికల్లో 14 సార్లు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని మల్లన్న తెలిపారు. ఎం. నారాయణ రెడ్డి, ఎ. శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి, ఏ. ఆశన్నగారి జీవన్ రెడ్డి వంటి నాయకులు ఎక్కువ కాలం ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. కేవలం జి. రాజారాం (1952), బాజిరెడ్డి గోవర్ధన్ (1999) మాత్రమే బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలుగా గెలిచారని చెప్పారు. మొత్తం 2,10,341 ఓట్లలో బీసీలు 1,35,999 మంది ఉండగా, రెడ్లు కేవలం 7,984 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు.

### - బోధన్ లో బీసీల ఓట్లు.. అధికారంలో రెడ్లది

బోధన్లో ఎం. నారాయణ రెడ్డి, పి. సుదర్శన్ రెడ్డి, షకీల్ అహ్మద్ వంటి నాయకులు వరుసగా అధికారాన్ని అనుభవించారని మల్లన్న పేర్కొన్నారు. 2,20,238 ఓట్లలో బీసీలు 1,42,401 మంది ఉండగా, రెడ్లు కేవలం 8,360 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. అయినా బీసీలు రాజకీయంగా వెనుకబడటం బాధాకరమన్నారు.

### నిర్మల్: ఇంద్రకరణ్ రెడ్డి- మహేశ్వర్ రెడ్డి రాజకీయాలే

నిర్మల్ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక్క బీసీ ఎమ్మెల్యే కూడా గెలవలేదని మల్లన్న అన్నారు. అల్లోల్ల ఇంద్రకరణ్ రెడ్డి, ఏలేటి మహేశ్వర్ రెడ్డి వంటి నాయకులే పార్టీలు మారుతూ అధికారాన్ని పంచుకున్నారని విమర్శించారు. మొత్తం 2,53,551 ఓట్లలో బీసీలు 1,54,159 మంది ఉండగా, రెడ్లు కేవలం 7,237 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు.

### - బాన్సువాడ: పోచారం కుటుంబ ఆధిపత్యంపై విమర్శ

బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి కుటుంబ రాజకీయాలకు 2028లో ముగింపు పలకాలని మల్లన్న పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు టికెట్ ఇవ్వకుండా ఇతర నియోజకవర్గం నుంచి రెడ్డి అభ్యర్థిని తీసుకురావడంతో బీసీ నాయకుడు కాసుల బాలరాజు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనను గుర్తు చేశారు. మొత్తం 1,95,384 ఓట్లలో బీసీలు 1,24,439 మంది (63 శాతం) ఉండగా, రెడ్లు కేవలం 8,697 మంది మాత్రమే ఉన్నారని వివరించారు.

### 59 స్థానాల్లో కోటి మంది బీసీలు.. 8 లక్షల అగ్రవర్ణ ఓట్లు

సర్జికల్ స్ట్రైక్–59 పరిధిలోని 59 నియోజకవర్గాల్లో సుమారు 96.59 లక్షల మంది బీసీ ఓటర్లు ఉన్నారని, రెడ్డి, వెలమ, కమ్మ సామాజిక వర్గాల ఓటర్లు కలిపి 8 లక్షలకు కూడా చేరుకోరని మల్లన్న పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ 59 స్థానాల్లో అగ్రవర్ణాలకే ప్రాతినిధ్యం దక్కడం సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. 2028 ఎన్నికల్లో ఈ 59 నియోజకవర్గాల్లో బీసీల రాజకీయ చైతన్యాన్ని పెంచి రాజ్యాధికార పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యమని, "బీసీల ఓట్లతోనే బీసీల రాజ్యాధికారం సాధిస్తాం" అని టీఆర్పీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 59 స్థానాల్లో రెడ్డి, వెలమ, కమ్మ సామాజిక వర్గాలు రాజకీయ అధికారాన్ని గుప్పెట్లో పెట్టుకున్నాయని పేర్కొంటూ, ఆ గుత్తాధిపత్యాన్ని 'కత్తెర' గుర్తుతో కత్తిరించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ లక్ష్యమని ప్రకటించారు.

### - కత్తెర గుర్తు... బీసీల రాజ్యాధికార ప్రతీక...

తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎన్నికల గుర్తు 'కత్తెర' కేవలం ఒక గుర్తు కాదని, అగ్రవర్ణాల రాజకీయ గుత్తాధిపత్యాన్ని కత్తిరించే ఆయుధమని మల్లన్న పేర్కొన్నారు. బీసీలను అనుచరులుగా, జెండాలు మోసే కార్యకర్తలుగా ఉంచిన రాజకీయ వ్యవస్థను ఛేదించి, వారిని ఎమ్మెల్యేలుగా, పాలకులుగా తీర్చిదిద్దడమే ఈ గుర్తు ఉద్దేశ్యమని వివరించారు.

### - 'బిగ్ క్లాస్' సిద్ధాంతంతో కొత్త రాజకీయ నినాదం....

బీసీలు సంఖ్యాపరంగా రాష్ట్రంలో అతిపెద్ద రాజకీయ శక్తి అని, అందుకే వారిని 'బిగ్ క్లాస్' గా అభివర్ణిస్తున్నామని మల్లన్న చెప్పారు. ఇతర వర్గాల ఓట్లపై ఆధారపడాల్సిన అవసరం లేదని, బీసీల ఓట్లే అధికారాన్ని నిర్ణయించగలవని స్పష్టం చేశారు. ఇతర పార్టీల్లో జెండాలు మోసే కార్యకర్తలుగా కాకుండా, చట్టసభల్లో ప్రజలకు ప్రాతినిధ్యం వహించే నాయకులుగా ఎదగాలని బీసీ యువతకు, నాయకులకు మల్లన్న పిలుపునిచ్చారు. బి-ఫామ్ల కోసం అగ్రవర్ణ పార్టీల చుట్టూ తిరిగే రోజులు ముగియాలని, సొంత పార్టీ ద్వారా రాజకీయ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బీసీలను కేవలం ఓటర్లుగానే ఉపయోగించుకుని, ఎమ్మెల్యే టికెట్లు మా త్రం తమ సామాజిక వర్గాలకే ఇస్తున్నాయని మల్లన్న ఆరోపించారు.

### 2028 లక్ష్యం... 59 స్థానాల్లో బీసీ జెండా...

2028 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ 59 నియోజకవర్గాల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ విజయకేతనం ఎగరవేసి బీసీల రాజ్యాధికారాన్ని స్థాపించడమే లక్ష్యమని మల్లన్న తెలిపారు. ఇది కేవలం ఎన్నికల పోరాటం కాదని, బీసీల ఆత్మగౌరవ ఉద్యమమని పేర్కొన్నారు. బీసీ ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్య ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందుతాయని, పైరవీలు, సిఫార్సుల రాజకీయాలకు ముగింపు పలుకుతామని మల్లన్న అన్నారు. ప్రజా కేంద్రిత పరిపాలనను తీసుకురావడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు.



## శనిగపురం తండాలో కార్డెన్ సెర్చ్

- 30 లీటర్ల గుడుంబా, 700 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం మైబాద్ రూరల్ సీఐ ఎన్. అంజలి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజు, ఎస్సై రవికిరణ్, కొరివి ఎస్సై సతీష్తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. శనిగపురం గ్రామ పరిధిలోని పాత తండా, బోడతండాల్లో నిర్వహించిన తనిఖీల్లో ప్రభుత్వం నిషేధించిన గుడుంబాను తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తులను గుర్తించారు. వారి వద్ద నుంచి సుమారు 30 లీటర్ల గుడుంబా, 700 లీటర్ల బెల్లం పానకంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బెల్లం పానకాన్ని సంఘటన స్థలంలోనే ధ్వంసం చేశారు. గుడుంబా తయారీలో పాల్గొన్న వ్యక్తులను పోలీస్ స్టేషన్కు తరలించి, వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుత్ షాక్తో మహిళ మృతి..

- తురకల సోమారం గ్రామంలో విషాదం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం తురకల సోమారం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ షాక్కు గురై ఓ మహిళ మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.గ్రామానికి చెందిన షేక్ సలీమా (35) ఇంటి వద్ద విద్యుత్ పరికరాలను ఉపయోగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్కు గురైనట్లు సమాచారం. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు సమాచారం.ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

## నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

మహబూబాబాద్, ఆగస్టు 7(ప్రభాత గమనం):

2027–28 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష (జెఎన్వీఎస్టీ–2027) ద్వారా 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఆన్లైన్ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించినట్లు మామునూర్ పిఎమ్ శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్. ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని గడువు తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ టాప్

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులను అభినందించిన డీజీపీ సీవీ ఆనంద్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం, ఆధునిక సాంకేతికత వినియోగం, ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం వంటి అన్ని కీలక అంశాల్లో తెలంగాణ పోలీసు శాఖ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచింది. ప్రధాన మంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ప్రగతి సమీక్ష సమావేశంలో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సైబర్ నేరాల నియంత్రణ పనితీరును తొమ్మిది కీలక ప్రమాణాల ఆధారంగా అంచనా వేయగా, తెలంగాణ దేశంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్ సీవీ ఆనంద్ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, పోలీసు కమిషనర్లు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్లు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయం తెలంగాణ పోలీసు శాఖ సమిష్టి కృషికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు రాష్ట్ర సైబర్ నేరాల సమన్వయ కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను ఏర్పాటు చేసిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. రూ.5 లక్షలు



లేదా అంతకంటే ఎక్కువ విలువైన సైబర్ మోసాల కేసుల్లో తక్షణ చర్యగా ఈ–జీరో ఎఫ్ఐఆర్ల నమోదును విజయవంతంగా అమలు చేస్తోంది. సైబర్ నేరాల ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రం 88 శాతం, బాధితుల డబ్బు తిరిగి ఇప్పించే ప్రక్రియలో 81 శాతం విజయాన్ని నమోదు చేసింది. అలాగే నేరాలకు సంబంధించిన అభ్యంతరకర ఆన్లైన్ సమాచారాన్ని తొలగించే కార్యక్రమంలో 88 శాతం ఫలితాలు సాధించింది. అంతర్రాష్ట్ర సమన్వయంలో 97 శాతం అభ్యర్థనలను పూర్తి చేయడంతో పాటు, రాష్ట్రాల మధ్య వచ్చిన 79 శాతం కేసులను విజయవంతంగా పరిష్కరించింది. అంతేకాకుండా 5,500 మంది సైబర్ నేరస్థుల వివరాలను నమోదు చేసి, 15 వేల అంతర్రాష్ట్ర నేర సంబంధాలను గుర్తించింది. పోలీసు అధికారుల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా 524 మంది అధికారులకు శిక్షణ అందించింది. దేశవ్యాప్తంగా గుర్తించిన 15 తీవ్రమైన సైబర్ నేరాల ప్రభావిత రాష్ట్రాల జాబితాలో తెలంగాణ లేకపోవడం రాష్ట్రం సైబర్ నేరాల నియంత్రణలో సాధించిన విజయానికి నిదర్శనంగా అధికారులు పేర్కొన్నారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన కార్యక్రమాల ద్వారా 8.5 లక్షల మందికి పైగా చేరుకోగా, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలపై మరో రెండు లక్షల మందికి ప్రత్యేక అవగాహన కల్పించారు. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ మరోసారి దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం రాష్ట్ర పోలీసు శాఖ సమిష్టి కృషికి నిదర్శనమని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు కృషి కొనసాగుతుందని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

ప్రభాత గమనం

వరంగల్, శనివారం, 08-08-2026

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో భరోసా

- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్
- వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి సాగును మరింత విస్తరించవద్దు
- ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల కుటుంబాలకు తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- మండల ప్రజావాణిని ప్రతి వారం తప్పనిసరిగా నిర్వహించి, ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలి
- వనమహోత్సవం, చేయూత పెన్షన్లు, ఏకరూప దుసుల కుట్టు పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి
- జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



మహబూబాబాద్ ఆగస్టు 7(ప్రభాత గమనం):

రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున రైతులను నీటి అవసరం అధికంగా ఉండే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం, హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, యువజన శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సీజనల్ పరిస్థితులు, వ్యవసాయం, మండల ప్రజావాణి, వనమహోత్సవం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, పాఠశాల ఏకరూప దుస్తుల కుట్టు పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాల ప్రకారం రానున్న నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరి వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగును విస్తరించకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను చూసి రైతులు వరి సాగును పెంచే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితి భవిష్యత్తులో రైతులకు నష్టాన్ని కలిగించే అవకాశం ఉన్నందున ప్రతి రైతుకు స్పష్టమైన సందేశం చేరేలా వ్యవసాయ అధికారులు పని చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం సాగునీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, మరో 15 రోజుల పాటు అన్ని ప్రధాన ప్రాజెక్టుల నీటి మట్టాలను సమీక్షించిన అనంతరం పరిస్థితులకు అనుగుణంగా సాగునీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోకి వస్తున్న నీటి ప్రవాహాలను బట్టి అందుబాటులో ఉన్న ప్రతి జల వనరును నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని నీటిపారుదల ప్రాజెక్టుల నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందని చెప్పారు. రాష్ట్రంలోని 1.05 కోట్ల రేషన్ కార్డు లబ్ధిదారులందరికీ ఆగస్టు 15వ తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించి, అర్హులైన ప్రతి కుటుంబానికి సకాలంలో అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో పంటల వైవిధ్యీకరణ కార్యాచరణ ప్రణాళికను యథావిధిగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను రైతులకు ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 99,81,167 ఎకరాల్లో వివిధ పంటల సాగు జరిగిందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆగస్టు 15 తర్వాత వర్షపాతం మరింత తగ్గే అవకాశమున్నందున ప్రతి జిల్లాలో సాగునీటి సలహా సమావేశాలు నిర్వహించి, నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో భవిష్యత్తులో విద్యుత్ సరఫరాపైనా ప్రభావం ఉండే అవకాశమున్నందున నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వరి సాగును మరింత పెంచవద్దని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 35 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, అది మరింత పెరగకుండా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. కంది, పెసర, మినుములు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచామని, పప్పుధాన్యాల విత్తనాల పంపిణీ కొనసాగుతోందన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ.. వచ్చే నెల నుంచి ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండే అవకాశముందని నిపుణులు సూచిస్తున్నందున ప్రణాళికలు, పంటల వైవిధ్యీకరణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో వరి సాగులో కనీసం 50 శాతం విస్తీర్ణాన్ని ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించే లక్ష్యంతో పని చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కనీసం 15 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు, కూరగాయలు, కంది, అలసందలు, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. వనమహోత్సవం కింద నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను పూర్తి చేసి, నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీజీఆర్‌ఏఎంజీ కార్యక్రమంలో భాగంగా ఈ వర్షాకాలంలో సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో ఇంకుడు గుంతలను నిర్మించాలని ఆదేశించారు. ఆగస్టు 15 నుంచి 1.05 కోట్ల తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, కొత్త చేయూత పింఛన్లు అర్హుల జాబితాను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేసి, వచ్చే నెల నుంచి పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రతి రైతు తమ వ్యవసాయ క్షేత్రంలో ఇంటిగ్రేటెడ్ ఫార్మ్ పాండ్ ఏర్పాటు చేసుకునేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఫార్మ్ పాండ్‌లను పంటల సాగు, ఉద్యానవనం, పశుసంవర్ధక, చేపల పెంపకం వంటి అనుబంధ రంగాలతో అనుసంధానం చేసి రైతుల ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి వినియోగంలో సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి రైతు ఒకే పంటపై ఆధారపడకుండా సమీకృత వ్యవసాయ విధానాలను అవలంబించి, స్థిరమైన ఆదాయాన్ని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమం అమలుకు సంబంధిత శాఖల అధికారులు గ్రామ సభల ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం చేయాలని, అలాగే నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.డి.ఓ మధుసూదన రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, డి.హెచ్.ఎస్.ఓ మరియన్న, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ రమేష్, జిల్లా పంచాయతీ అధికారి రేవంత్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల భద్రతే లక్ష్యం

- నేరాల నియంత్రణలో రాజీలేని పోలీసింగ్‌కు ప్రాధాన్యం
- పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు న్యాయం.
- సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

ప్రభాతగమనం, వరంగల్ క్రైం బ్యూరో :



భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ చర్యలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, జిల్లాలో నేరాల నియంత్రణలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. ప్రతి కేసులో నాణ్యమైన, శాస్త్రీయ దర్యాప్తు నిర్వహించి బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సి.సి.టి.ఎన్.ఎస్. (2.0)లో ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి పారదర్శకత, సమాచార సమన్వయం, ప్రజలకు అందించే సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలపై గ్రామ స్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి రవాణా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల దర్యాప్తులో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు, కాటారం డిఎస్పి సూర్యనారాయణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు మరియు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సీరోలు పీఎస్ ను తనిఖీ చేసిన ఎస్పీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :




మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, వార్షిక తనిఖీలో భాగంగా ఈరోజు సీరోలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ పనితీరు, రికార్డులు, పోలీసింగ్ విధానాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ మరియు నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, డయల్-112 కాల్స్‌పై స్పందన, గ్రామాల సందర్శన వివరాలు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన సమాచార సేకరణ, గ్రామ స్థాయిలో అమలవుతున్న వి.పి.ఓ. (విలేజ్ పోలీస్ ఆఫీసర్ ) వ్యవస్థ పనితీరు, రాత్రి పహారా (నైట్ పాత్రోలింగ్ ), స్టేషన్ సిబ్బంది వివరాలు అనుమానితుల వివరాలు, నేరాల పరిస్థితి తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. డయల్-112 ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని తెలిపారు. గ్రామాల సందర్శనలను నిరంతరం కొనసాగిస్తూ గ్రామస్థులతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలని, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాచార సేకరణను మరింత ముమ్మరం చేసి కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. వి.పి.ఓ. వ్యవస్థను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణ, సైబర్ అవగాహన, శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి పహారాలను పటిష్ఠంగా నిర్వహిస్తూ అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిరంతర నిఘా ఉంచాలని, రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిజాయితీ, ప్రజల పట్ల మర్యాదపూర్వక వైఖరి, బాధ్యతాయుత సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ఈ వార్షిక తనిఖీలో డీఎస్పీ కృష్ణ కిషోర్, మరిపెడ సీఐ పవన్, సీరోలు ఎస్ఐ సంతోష్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'నా భర్తను చంపు.. లేదంటే నేను చనిపోతా'

- భార్య చాటింగ్‌తో షాక్‌కు గురైన భర్త
- డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్

డోర్నకల్ ఆగస్టు 7(ప్రభాత గమనం):



భర్తను హత్య చేయాలని ప్రియుడిని కోరుతూ భార్య పంపినట్లు చెబుతున్న వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సందేశాలు వెలుగులోకి రావడం కలకలం రేపింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో వెలుగుచూసింది. చిలుకోడుకు చెందిన గాదే రాజేశ్వరరావుకు 2016లో సూర్యాపేట జిల్లాకు చెందిన భవానితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే తన భార్య భవానికి సైదులు అనే కొరియర్ బాయ్‌తో వివాహేతర సంబంధం ఉన్నట్లు రాజేశ్వరరావు ఆరోపించారు. ఈ విషయం గత నెల 27న తనకు తెలియడంతో రాజేశ్వరరావు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం తన అన్నను తీసుకురావడానికి వెళ్తున్న సమయంలో సైదులు తనను వెంబడించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని నుంచి తప్పించుకుని ఇంటికి తిరిగి వచ్చిన రాజేశ్వరరావు.. తన భార్య ఫోన్‌ను పరిశీలించినట్లు తెలిపారు. అందులో తనను ఎలాగైనా చంపాలని, లేదంటే తాను చనిపోతానని భవాని సైదులుకు మెస్సేజ్ పంపినట్లు చెబుతున్న సందేశాలను గుర్తించినట్లు రాజేశ్వరరావు పేర్కొన్నారు.

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా

## చిలువేరు సమ్మయ్య గౌడ్





- రెండు దశాబ్దాల సేవా నిరతి, నిబద్ధతకు దక్కిన గుర్తింపు
- అధినాయకత్వానికి ధన్యవాదాలు తెలిపిన చిలువేరు

కేసముద్రం, ఆగస్టు 7 (ప్రభాత గమనం):

గత రెండు దశాబ్దాలుగా కేసముద్రం మండలంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్న చిలువేరు సమ్మయ్య గౌడ్‌ను కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. ప్రజాసేవకే అంకితమైన నాయకుడికి ఈ కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.పదవుల కంటే సేవే ముఖ్యమనే లక్ష్యంతో సమ్మయ్య గౌడ్ 'సమ్మి గౌడ్ ఫౌండేషన్'ను స్థాపించి, తన సొంత వనరులతో ఎన్నో పేద కుటుంబాలకు ఆపన్నహస్తం అందించారు. విద్యార్థుల చదువుకు తోడ్పాటునందిస్తూ, ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు అలాగే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి కుటుంబానికి నేనున్నానంటూ అండగా నిలిచారు. ప్రజా సంక్షేమాన్నే ధ్యేయంగా భావించి ఆయన చేస్తున్న సేవలు మండల ప్రజల మనస్సుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిపెట్టాయి.కాంగ్రెస్ పార్టీ కేడర్‌ను సమన్వయం చేస్తూ, పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సమ్మయ్య గౌడ్ ముందు వరుసలో నిలిచారు. నాయకులు, కార్యకర్తల మధ్య వారధిగా ఉంటూ నిస్వార్థంగా పనిచేసిన ఆయన సేవలను గుర్తించి అధినాయకత్వం ఈ బాధ్యతలను అప్పగించింది.సమ్మయ్య గౌడ్ సేవా నిరతిపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్లకు నూతన అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సమ్మయ్య గౌడ్ నియామకంతో కేసముద్రం మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతుందని, ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ ముందంజలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తనపై నమ్మకం వుంచి మండల అధ్యక్షుడిగా నియమించడంతో బాధ్యత మరింత పెరిగిందని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సమ్మి గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374